## హ్యాపీయెస్ట్ కంట్రీస్

13వ వరల్డ్ హ్యాపీయెస్ట్ కంట్రీస్ ఇండెక్స్ (ప్రపంచ ఆనందమయ దేశాల జాబితా)-2025ను మార్చి 20న విడుదల చేశారు. దీనిలో చిన్న దేశమైన ఫిన్లాండ్ వరుసగా 8వ సారి మొదటి ర్యాంకులో నిలిచింది. డెన్మార్క్ 2, ఐస్‌లాండ్ 3, స్వీడన్ 4, నెదర్లాండ్స్ 5, కోస్టారికా 6, నార్వే 7, ఇజ్రాయెల్ 8, లక్సెంబర్గ్ 9, మెక్సికో 10వ స్థానాల్లో నిలిచాయి. భారతదేశం 118వ ర్యాంకులో నిలవగా, పాకిస్థాన్ 109, చైనా 68, శ్రీలంక 133, బంగ్లాదేశ్ 134వ స్థానాల్లో నిలిచాయి. అఫ్గానిస్థాన్ ఈ జాబితాలో చివరి స్థానం 147వ ర్యాంకులో నిలిచింది. ఈ నివేదికను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ రూపొందించింది.

# 'పది' తరువాత నిర్ణయం.. భవిష్యత్తు పదిలం



చిన్నపిల్లల్ని పెద్దయ్యాక ఏమవుతావని అడగటం చాలా సాధారణమైన ప్రశ్న. పిల్లలు కూడా చాలా సునాయాసంగా వారికి నచ్చిన విషయాల నుంచి, కార్టూన్‌ల నుంచి టికెట్ కలెక్టర్, ఫైర్ ఫైటర్, చెఫ్, ఆస్ట్రోనాట్ ఇలా ఎన్నో ఊహించని జవాబులు ఇస్తారు. వాళ్ల చిన్న ప్రపంచం కాస్త పెద్దదైన కొద్దీ వారు చెప్పే సమాధానాలు మారుతాయి. సునీతా విలియమ్స్‌ని చూసి ఆస్ట్రోనాట్ అవుతానని, కోహ్లీ సెంచరీ కొట్టగానే క్రికెటర్ అని, గేమ్స్ ఆడుతూ గేమ్ డిజైనర్ అని, కల్చరల్ యాక్టివిటీస్, యూట్యూబ్ షోస్ చూసి యాక్టింగ్ లేదా ఇన్‌ఫ్లూయన్సర్ అని ఇలా కొత్త కొత్తవి చెబుతారు. కానీ కెరీర్ చాయస్ అనేది అంత సునాయాసంగా తీసుకోగలిగే నిర్ణయమా? చౌరస్తాలో నిల్చొని లెఫ్ట్ వెళ్తే మెడికల్ కాలేజీ, రైట్ వెళ్తే ఇంజినీరింగ్ కాలేజీ ఎటు వెళ్తావని సులభంగా తల్లిదండ్రులు అడగగలరా? విద్య భవిష్యత్తుకు మార్గం వేస్తుందని ఒక జనరేషన్ పేరెంట్స్ నమ్మారు. కాబట్టి భారతీయులు ఇప్పుడు ప్రపంచమంతా వ్యాపించి, ఉన్నతమైన పదవుల్లో ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాల్లో తల్లిదండ్రుల ప్రమేయం ఎప్పుడూ ఉంటుంది. ఒకప్పుడు ఎక్కువగా ఇంజినీరింగ్, మెడికల్, లా లేదా టీచింగ్ వంటి సంప్రదాయ కెరీర్‌లను ఎంచుకునేవారు. వాటి వల్ల ఇంట్లో వారి కలలు, సొసైటీలో స్టేటస్, ఫైనాన్షియల్‌గా భద్రత ఉంటుందని భావించేవారు. మనకు తెలిసిన వారిని అడిగి, నిర్ణయాలు తీసుకునేవారు. కానీ ఇప్పుడు ప్రపంచం మారింది. ఇప్పటి జనరేషన్‌కు ఇంటర్నెట్, ఆన్‌లైన్ రిసోర్సెస్ వల్ల ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. డిగ్రీతో పాటు స్కిల్స్‌కు ఎంతో ప్రాముఖ్యత పెరిగింది. ట్రెడిషనల్ చాయిస్‌లతో పాటు టెక్నాలజీ, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ వంటి వాటివైపు మక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా తెలుసుకునే అవకాశం, కెరీర్ కౌన్సెలర్లు అందుబాటులో ఉండటం, తల్లిదండ్రుల అనుభవాలు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. పదో తరగతి తర్వాత ఏంటి అని ఆలోచించే సమయం వచ్చేసింది. భవిష్యత్తును దృష్టి లో ఉంచుకొని తీసుకోవాల్సిన నిర్ణయం. మీ నిర్ణయం ఏంటి?


## కెరీర్‌ను ఎలా ఎంచుకోవాలి?

- ఇంజినీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్‌ను ఇంట్రడ్యూస్ చేసినపుడు ట్రెడిషనల్ కోర్స్‌లైన మెకానికల్ వంటి వాటివైపు మక్కువ చూపారు. కానీ ఇప్పుడు కంప్యూటర్‌లోని వివిధ స్పెషలైజేషన్‌లపై మక్కువ చూపుతున్నారు. మధ్యలో సాఫ్ట్‌వేర్ బూమ్ లేనపుడు ఫార్మా వంటి వాటి వైపు మళ్లారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకునే కాకుండా ఎమర్జింగ్ కోర్సుల గురించి కూడా ఆలోచించాలి.
- మార్కెట్ మారుతుంటుంది. కాబట్టి ఒక మార్కెట్ విలువ ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకుంటే కష్టం. అలాగే మార్కెట్ ఇప్పుడు అనే కాకుండా భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. ప్రొఫెషన్‌ను జీతంతో ముడిపెట్ట కూడదు. ఎందుకంటే ఒకే ప్రొఫెషన్‌లో ఉన్నా జీతం అనేది ఆ వ్యక్తి పని పై ఆధారపడి ఉంటుంది. ఏ కాలేజీలో చేరాలి అనగానే ప్లేస్‌మెంట్, పే స్కేల్ గురించి విద్యార్థులు ఆలోచిస్తారు. మంచి విషయమే. కానీ జీతం అనేది మన స్కిల్స్ మీద ఆధారపడి ఉంటుంది. అలాగే జీతం ఒక్కటే ముఖ్యం కాదు.
- ఎప్పుడైనా ఎంచుకునే కెరీర్‌ని మూడు విషయాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచించాలి. అవి.. ఇంట్రెస్ట్ (ఆసక్తి), క్యాపబిలిటీ (సామర్థ్యం), మార్కెట్ వ్యాల్యూ (మార్కెట్ విలువ). ఆసక్తి, సామర్థ్యం, మార్కెట్ విలువ ఈ మూడు ఎంతో కొంత సమతుల్యత ఉండటం అవసరం.

### ఇంట్రెస్ట్

**ఆస్ట్రోనాట్ కావాలని అనుకోవడం ఆసక్తా? అవును, కాదు?**

- ఒకానొక సందర్భంలో ఒక విద్యార్థి 'నేను పురావస్తు శాస్త్రవేత్త కావాలనుకుంటున్నాను. కానీ తల్లిదండ్రులు అభ్యంతరం చెబుతున్నారు అని నిరాశగా అన్నాడు'. ఇది కొందరు ఎదుర్కొనే సమస్య కూడా.
- తెలిసిన దారిని ఎంచుకోవడం, ఆ దారిలో వెళ్లడం సులభంగా అనిపిస్తుంది. తెలిసిన మార్గంలో ప్రయాణిస్తున్నపుడు కష్టాలు రాకుండా గమ్యం చేరుకుంటామనిపిస్తుంది. అదే కొత్త దారైతే మార్గమంతా ఎంతో జాగ్రత్తగా ఉంటూ, ఏదైనా సమస్య వస్తుందేమో అనే ఆందోళన ఉంటుంది. అలాగే తెలిసిన కెరీర్‌ను ఎంచుకుంటే భవిష్యత్తు ఎలా ఉంటుందనే దానిపై అంచనా ఉంటుంది. అదే తెలియని దానికైతే ఆందోళనగా ఉంటుంది. మన చుట్టూ ఉన్నవారు చదివిన చదువు పట్ల మనకు ఒక అవగాహన ఉంటుంది. అది సరైనదని అనుకుంటాం. అందులో తప్పులేదు. తల్లిదండ్రులు సంకోచించడంలో కూడా తప్పులేదు. కానీ ఆ కెరీర్ కోసం ఎలా చదవాలి, ఏం చదవాలి, ఎక్కడ చదవాలి, ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే విషయాలపై పూర్తి అవగాహన తెచ్చుకొని క్రమశిక్షణతో చదువుతానని దృఢ సంకల్పంతో వారికి చెబితే తప్పకుండా అంగీకరిస్తారు. ఆసక్తి అనేది కేవలం ఆ కోర్సు పేరు తెలిసి ఉండటం కాదు. దాని గురించి ఒక లోతైన అవగాహన కలిగి ఉండటం. అది సాధించడానికి ఎంత హార్డ్‌వర్క్ అయినా చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఆ నమ్మకం మీ పై మీకు ఉండాలి. ఇంట్లో వారికి కలిగించాలి.




- అలాగే గణితం అంటే భయం. కాబట్టి బైపీసీ చదువుతానని కొందరంటారు? కప్ప కోయడం ఇష్టం లేదు కాబట్టి ఇంజినీరింగ్ చేస్తానని ఇంకొందరంటారు. ఏది ఇష్టమో అది చేస్తారా. ఒకటి ఇష్టం లేదు కాబట్టి ఇంకోటి ఎంచుకుంటారా.
- ఇష్టమైన దాని కోసం కష్టపడటంలో ఇబ్బంది ఉండదు. అదే ఇష్టం లేనిదైతే చిన్న ఆటంకాన్ని కూడా పెద్ద అవరోధంలా కనిపిస్తుంది. ఇష్టాయిష్టాలు సరైనవేనా అని ఆలోచించిన తర్వాత నిర్ణయం తీసుకోండి.

### క్యాపబిలిటీ

- కష్టమైన వాటిని కూడా ఎంచుకొని ఒత్తిడితో బాధపడటం మంచిది కాదు. కాకపోతే వదిలేసే ముందు నిజంగా చేతకాదా? లేదా? అది అపోహ? అని నిర్ణయించుకోవాలి.
- సామర్థ్యం పట్ల అవగాహన ఉండాలి. ఉదాహరణకు డిజైనర్ కెరీర్ పట్ల మక్కువ ఉంది. ఇందులో రాణించాలంటే క్రియేటివిటీ లేదా స్కెచింగ్ లాంటివి అవసరం. ప్రస్తుతం ఆ స్కిల్స్ లేకపోయినా కృషితో, సాధనతో నేర్చుకోగలరా? లేదా? అనే దానిపై తీసుకోవాల్సిన నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఏ చదువులో అయినా ఆ చదువుకు తగ్గ సబ్జెక్ట్స్‌ను నేర్చుకోగలగాలి. ఆ కెరీర్‌కు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. ఆ సబ్జెక్ట్ ఎలా చదవాలి, చదవగలరా లేదా అని బేరీజు వేసుకుని నిర్ణయించుకోవాలి. ఒక పదానికి అర్థం తెలియకపోతే డిక్షనరీలో చూస్తాం. డాక్టర్లకు జ్ఞాపకశక్తి ఎక్కువ అవసరం, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సమయస్ఫూర్తి అవసరం. యుద్ధం చేసే సైనికులకు ధైర్యంతో పాటు నిర్ణయం తీసుకునే ఆలోచన అవసరం. అడ్వకేట్‌కు వాక్చాతుర్యం అవసరం. సాధించే సామర్థ్యం లేక పోయినా ఆ సామర్థ్యాన్ని పెంచుకునే కృషి, ధైర్యం, పట్టుదల లేకపోతే అనుకున్నది సాధించడం కష్టం.

## మార్కెట్ వ్యాల్యూ

- ఏ డిగ్రీ తీసుకున్నా దానికి తగ్గ అవకాశాలు ఏంటని తెలుసుకోవాలి. ఆ డిగ్రీతో గ్రాడ్యుయేషన్ తరువాత ఏమి చేయవచ్చు, ఎలాంటి కంపెనీల్లో చేరవచ్చు అనేది ఆలోచించాలి. చదువుతున్నదానికి జాబ్ మార్కెట్‌లో మీ నుంచి ఆశిస్తున్న నాలెడ్జ్, స్కిల్స్ ఏంటనేది తెలుసుకోవాలి. మార్కెట్ వ్యాల్యూని బేరీజు వేసుకోవాలి.
- 40 ఏళ్ల ఉద్యోగ కాలంలో పదిసార్లయినా మార్కెట్ మారుతుంది. 2000లో డాట్ కామ్ బబుల్, 2008 ఆర్థిక మాంద్యం, 2020-21 కొవిడ్ పాండమిక్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయి. కాబట్టి మార్కెట్ వ్యాల్యూపై మాత్రమే ఆధారపడకండి. ఎందుకంటే సమాజంలో అన్ని వృత్తుల వారు అవసరం. ఎంచుకున్న కెరీర్‌లో నిష్ణాతులై ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా నెగ్గుకు రాగలరు.
- ఎవరైనా చదువు పూర్తయ్యింది అంటే ఉద్యోగం వచ్చిందా, జీతం ఎంత అని మొదట అడుగుతారు. వారికి తెలిసిన కంపెనీ అయితే వావ్ అంటారు. అదే తెలియని పెద్ద కంపెనీ అయితే అంత ఉత్సాహం ఉండదు. ఇతరులను బట్టి కాకుండా నిర్ణయాలు మీ గురించి, మీ కోసమై ఉండాలి.
- ఒక నిర్ణయం తీసుకుని దానికి తగిన పరీక్షలు రాసి, 12వ తరగతి తరువాత ఆ కెరీర్‌కు సంబంధించిన కోర్సుల్లో చేరతారు. తర్వాత ఏంటి? గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే వరకు ఏం ఆలోచించాల్సిన పని లేదని అనుకోకండి. కెరీర్‌కు కావాల్సిన స్కిల్స్‌ని, నాలెడ్జ్‌ను సమకూర్చుకోండి.
- పర్సనల్ ఇంట్రెస్ట్‌ను దృష్టిలో పెట్టుకుని వర్క్ లైఫ్ బ్యాలెన్స్ గురించి అలోచించి జాగ్రత్తగా కెరీర్‌ను ఎంచుకోవాల్సిన సమయం ఇది. ఫ్రెండ్స్ చదువుతున్నారు కాబట్టి, సోషల్ మీడియాలో పాపులర్ అయ్యింది కాబట్టి అని కాకుండా మీ కోసం మీకు నచ్చిన కెరీర్‌ను ఎంచుకోండి.
- మీ ఐసీఎం ఎలా ఉందో ఆసక్తి గల హై స్కూల్ విద్యార్థులు ఈ సైకోమెట్రిక్ అనాలిసిస్‌ను ప్రయత్నించవచ్చు. ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చెక్ చేసుకోండి.

Sirisha Reddy
Director - Academics
Gyanville Academy Technologies
+91 7386660269
www.gyanville.in



## ఎన్‌జీఆర్ఐలో...

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 11
- **పోస్టులు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- **విభాగాలు:** జనరల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్ అండ్ పర్చేజ్
- **అర్హతలు:** ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ టైపింగ్ వచ్చి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** https://www.ngri.res.in

## నేషనల్ హైవేస్‌లో..

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 26
- **పోస్టులు:** ప్రిన్స్‌పల్ డీపీఆర్ ఎక్స్‌పర్ట్, సీనియర్ హైవే ఎక్స్‌పర్ట్, ట్రాఫిక్ ఎక్స్‌పర్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.nhai.gov.in

## యూపీఎస్సీలో...

కేంద్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 111
- **పోస్టులు:** అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏఈ, సిస్టమ్ అనలిస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 1
- **వెబ్‌సైట్:** ttps://upsconline.gov.in

## మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో...

మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 20
- **పోస్టులు:** జూనియర్ టెక్నీషియన్
- **విభాగాలు:** కాంట్రాక్ట్ ఎగ్జామినర్ ఇంజినీరింగ్, కాంట్రాక్ట్ ఫిట్టర్ జనరల్
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మే 2
- **వెబ్‌సైట్:** www.avnl.co.in

## ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో...

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 15
- **పోస్టులు:** ఎగ్జిక్యూటివ్ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్)
- **అర్హతలు:** హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్/మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ ఉత్తీర్ణత
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** www.ntpc.co.in